



ఖాళీగా ఉన్న రెండో నంబరు ప్లాట్‌ఫారం

ఎంపీగా సీఎం రమేశ్ ప్రమాణ స్వీకారం



న్యూఢిల్లీ పార్లమెంట్ హాలులో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సీఎం రమేశ్

అనకాపల్లి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో సోమవారం ప్రారంభమైన 18వ లోక్‌సభ సమావేశాల సందర్భంగా రాష్ట్రానికి చెందిన పలువురు ఎంపీలు ప్రమాణ స్వీకారం చేశారు. ఇందులో భాగంగా అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ఇంగ్లీషులో ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు కూటమి పార్టీ నేతలు సీఎం రమేశ్‌కు అభినందనలు తెలిపారు.

అర్జీలకు సత్వర పరిష్కారం



అర్జీదారునితో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

- అధికారులకు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశం

అనకాపల్లి రూరల్, జూన్ 24: నూతన ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించవద్దని, నిర్దిష్ట కాల వ్యవధిలో నాణ్యమైన పరిష్కారం చూపించాలని సూచించారు. శంకరంలోని కలెక్టరేట్ సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయనతో పాటు జేసీ జాహ్నవి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 161 అర్జీలు స్వీకరించారు. డీఆర్‌వో దయానిధి, వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్వాహారాయుళ్లలో టెన్షన్

ఉపాధి హామీ పథకంలో అక్రమాలపై కూటమి ప్రభుత్వం దృష్టి

- సామాజిక తనిఖీ పకడ్బందీగా జరిగేలా కసరత్తు
- వైసీపీ ప్రభుత్వ హయాంలో మొక్కుబడిగా సాగిన వైనం
- తనిఖీలకు రేట్లు పెట్టి మరీ సిబ్బంది నుంచి వసూళ్లు
- పనుల్లో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించే ప్రయత్నంలో కొత్త ప్రభుత్వం
- అవినీతికి పాల్పడిన అధికారుల్లో గుబులు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్ ఫొటో)

చోడవరం, జూన్ 24:

ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు కళ్లెం వేసేలా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీకి మరింత పదును పెట్టేలా దాని తీరుతెన్నులను కొత్త ప్రభుత్వం ప్రత్యేకంగా సమీక్షిస్తుండడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

వాస్తవానికి గత వైసీపీ పాలనలో ఉపాధి సామాజిక తనిఖీ వ్యవహారం పూర్తిగా మొక్కుబడి తంతుగానే మారిపోయింది. గతంలో ఉపాధి నిధులతో చేపట్టిన ఇంజనీరింగ్ పనులైనా, పింఛనర్ల వ్యవహారమైనా, ఉపాధి పనులైనా వాటిలోని లోపాలపై సమగ్రంగా క్షేత్రస్థాయిలో విచారణ చేసి, అందులోని లోపాలను గుర్తించి వాటిని మండల స్థాయిలో అందరి సమక్షంలో సామాజిక తనిఖీ సమావేశంలో బహిరంగంగా ఎత్తిచూపించే పరిస్థితి ఉండేది. అక్రమాలకు బాధ్యులైన వారి నుంచి స్వాహాకు గురైన సొమ్మును ముక్కుపిండి మరీ వసూలు చేసే విధంగా సామాజిక తనిఖీ వ్యవహారం సాగేది. అలాగే సామాజిక తనిఖీకి స్థానికంగా ప్రజాప్రతినిధులను ఆహ్వానించి మరీ, సామాజిక తనిఖీ విభాగం సిబ్బంది క్షేత్రస్థాయిలో తాము గుర్తించిన లోపాలు ఎత్తి చూపించేవారు. ఇంత పకడ్బందీగా సాగిన సామాజిక తనిఖీ వ్యవహారాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నీరుగార్చేసింది. సామాజిక తనిఖీ వ్యవహారాన్ని పూర్తిగా మొక్కుబడి తంతుగా మార్చేసింది.

సామాజిక తనిఖీకి రేట్లు ఫిక్స్

లోపాలు ఎత్తిచూపే సామాజిక తనిఖీ వ్యవహారం వైసీపీ పాలనలో తూతూమంత్రంగా మార్చివేయడంతో సామాజిక తనిఖీ సిబ్బంది సామాజిక తనిఖీలకు రేట్లు కూడా నిర్ణయించి ఆ మేరకు వసూలు చేసి ఆడిట్ పూర్తయినట్టు తంతు నడిపినట్టు విమర్శలున్నాయి. పనులను బట్టి పంచాయతీ స్థాయిలో ఉపాధి సిబ్బంది నుంచి రూ. 5 వేలు నుంచి రూ.8వేలు వరకు సామాజిక తనిఖీకి వసూలు చేసినట్టు సమాచారం. ఇక ఇంజనీరింగ్ పనులకు సంబంధించి జరిగే సామాజిక తనిఖీ రేట్లు దీనికి రెట్టింపుగానే వసూలు చేసినట్టు చెబుతున్నారు. జిల్లాలో జరిగిన ఉపాధి పనులకు చేసిన ఖర్చులకు కూడా ఎక్కడా పొంతనలేని విధంగా వ్యవహారం సాగినట్టు సమాచారం. పనులపై ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడంతో దిగువ స్థాయిలో ఉపాధి సిబ్బంది, అధికారులదే ఇష్టారాజ్యంగా మారిందని అంటున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో సామాజిక తనిఖీ అంటే మామూళ్లు ఇస్తే సరిపోతుందిలే అన్న భావన క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బందిలో నెలకొందని పలువురు చెబుతున్నారు.

సామాజిక తనిఖీ తీరుపై ప్రత్యేక దృష్టి

అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం

... మిగతా 8వ పేజీలో

రైలు ప్రయాణికుల పాట్లు

ప్రధాన రైళ్లు రద్దు కావడంతో అవస్థలు



బొకారో ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీలో కిక్కిరిసి ఉన్న ప్రయాణికులు

అనకాపల్లి టౌన్, జూన్ 24: అనకాపల్లి మీదుగా రాకపోకలు సాగించే ప్రధాన రైళ్లను దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ రద్దు చేయడంతో ప్రయాణికులు సోమవారం ఇబ్బందులు పడ్డారు. కొందరు ప్రయాణికులు తప్పనిసరి పరిస్థితుల్లో ఇటుగా వచ్చిన రైళ్లలో కిక్కిరిసి ప్రయాణించారు.

విశాఖ -గుంటూరు, గుంటూరు - విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్, గుంటూరు - రాయగడ, రాయగడ- గుంటూరు రైళ్లు గత ఆరు నెలలుగా రద్దు జాబితాలో ఉన్నాయి. పండగ సమయాల్లో అందుబాటులోకి తీసుకువచ్చినా తిరిగి రద్దు చేశారు. వీటితో పాటు గతంలో పాసింజర్ రైళ్లుగా అందుబాటులో ఉండి ఎక్స్‌ప్రెస్‌గా మారిన మచిలీపట్నం - విశాఖపట్నం, విశాఖపట్నం - మచిలీపట్నం, రాజమండ్రి- విశాఖ, విశాఖ- రాజమండ్రి రైళ్లు ఎప్పటి నుంచో రద్దు జాబితాలో ఉన్నాయి. వీటికి తోడు నిత్యం సామాన్య ప్రయాణికులకు ఇటు విశాఖ వెళ్లేందుకు, అటు విజయవాడ మార్గంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు అందుబాటులో ఉండే రత్నాచల్, జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లను రెండు వైపులా రద్దు చేశారు. విజయవాడ సెక్షన్ పరిధిలో ట్రాక్ ఆధునికీకరణ పనుల పేరుతో ఎన్నడూ లేని విధంగా సుమారు 45 రోజుల పాటు ఈ రైళ్లను రద్దు చేయడం పట్ల ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండే రైళ్లు రద్దు చేసినప్పుడు దూర ప్రాంతాల నుంచి వెళ్లే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకైనా జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో హాల్ట్ కల్పించకపోవడం విచారకరమని పలువురు ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. ఉదయం వేళ విజయవాడ వైపు వెళ్లేందుకు తెల్లవారుజామున హౌరా- హైదరాబాద్ ఈస్ట్‌కోస్టు రైలు అందుబాటులో ఉండేది. ఆ తరువాత ఏడు గంటలకు జన్మభూమి, ఎనిమిది గంటలకు సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లు ఉండేవి. అయితే సింహాద్రి, జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు కావడం వల్ల ఈస్ట్‌కోస్టు రైలు అనకాపల్లి మీదుగా తెల్లవారుజామున వెళ్లిన తరువాత మళ్లీ విజయవాడ వైపు ప్రయాణికులు వెళ్లాలంటే తొమ్మిదిన్నర గంటల సమయంలో బొకారో- అలెప్పీ, మధ్యాహ్నం 1.55 గంటలకు ప్రశాంతి, 2.40 గంటలకు తిరుమల ఎక్స్‌ప్రెసే దిక్కు. అలాగే తెల్లవారుజామున ఆరు గంటలలోపే విశాఖ, మెయిల్, గోదావరి, గరీబ్‌రథ్ వెళ్లిపోతుంటాయి. జన్మభూమి, సింహాద్రి, రత్నాచల్ వంటి ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు కావడం వల్ల తుని, అన్నవరం, రాజమండ్రి, ఏలూరు, విజయవాడకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎన్నడూ లేని విధంగా నెలన్నర రోజులు ప్రధాన రైళ్లు రద్దు కావడంతో దూర ప్రాంతాలకు వెళ్లేవారు ప్రైవేటు బస్సులను ఆశ్రయిస్తున్నారు. దగ్గర ప్రాంతాలకు వెళ్లే వారు చార్జీ అధికమైనా ఆర్టీసీలో ప్రయాణం చేయక తప్పడం లేదు.

జన్మభూమికి గ్రీన్‌సిగ్నల్ ... వార్త 7వ పేజీలో

స్తబ్ధుగా డీసీసీబీ

- ఈ నెల మొదటి వారంలో పాలకవర్గం రద్దు
- పర్సన్ ఇన్‌చార్జి లేకపోవడంతో కుంటుపడిన పాలన
- సహకార సంఘాలదీ అదే పరిస్థితి
- రుణాలు మంజూరుపై ప్రభావం



విశాఖపట్నం, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు గత ప్రభుత్వం నియమించిన పాలకవర్గం రద్దయింది. దీంతో ప్రస్తుతం సారధి లేక పాలన స్తంభించింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారంతా రాజీనామా చేయాలని ఈ నెల మొదటి వారంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. ఈ మేరకు ఇన్‌చార్జి ఛైర్‌పర్సన్ పదవికి కోలా గురువులు రాజీనామా చేయడంతో పాలకవర్గం రద్దయింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ లేదా జాయింట్ కలెక్టర్‌కు పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించాల్సి ఉంది. అయితే రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు సంబంధించి తొలుత మంత్రివర్గం ప్రమాణం, తాజాగా ఎమ్మెల్యేలు పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. దీంతో డీసీసీబీ బాధ్యతలు జిల్లా అధికారులకు అప్పగించడంలో జాప్యం జరిగింది.

గడచిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బ్యాంకు కార్యకలాపాలు, వ్యాపార లావాదేవీలపై నిర్వహించే ఆడిట్ నివేదికను జూన్ చివరి వారంలో బ్యాంకు పాలకవర్గం ఆమోదించాలి. తరువాత నెలాఖరులోగా రిజర్వు బ్యాంకుకు పంపాల్సి ఉంటుంది. ప్రస్తుతం డీసీసీబీకి పాలకవర్గం/పర్సన్ ఇన్‌చార్జి లేకపోవడంతో ఆడిట్ రిపోర్టును ఎవరు ఆమోదిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ నెలాఖరులోగా ఆడిట్ రిపోర్టు ఆర్‌బీఐకు పంపకపోతే పలు రకాల ఇబ్బందులు ఎదురవుతాయనే ఆందోళన నెలకొంది.

ఇదిలావుండగా డీసీసీబీలతోపాటు ప్రాథమిక సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జి కమిటీలు కూడా రద్దయ్యాయి. దీంతో జిల్లాలోని 98 ప్రాథమిక సహకార సంఘాల్లో రుణాల మంజూరు నిలిచిపోయింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు రుణాల అవసరం ఉంటుంది. గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో తీసుకున్న రుణాలు జూన్‌లో చెల్లించి, రెండు, మూడు రోజుల తరువాత తిరిగి కొత్త రుణం కోసం సంఘానికి వస్తారు. ప్రస్తుతం పలు సంఘాల పరిధిలో గత ఏడాది తీసుకున్న రుణాలు చెల్లించిన రైతులకు తిరిగి రుణాలు ఇవ్వాలంటే సంఘం పాలకవర్గం ఆమోదం తప్పనిసరి. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు పాలకవర్గాలు లేకపోవడంతో రుణాల మంజూరు నిలిచిపోయింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని డీసీసీబీ/ప్రాథమిక సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జులు లేదా పాలక వర్గాలను నియమించాలని రైతులు కోరుతున్నారు.

లిఫ్ట్ అడిగి సుత్తితో దాడి

- వాహనదారుడికి తీవ్ర గాయాలు
- నిందితుడు పరారీ



గాయాలతో పోలీస్ స్టేషన్‌కి వచ్చిన వబ్బలరెడ్డి ప్రసాద్

నర్సీపట్నం, జూన్ 24: బైక్‌పై లిఫ్ట్ ఇచ్చిన ఓ వ్యక్తిపై సుత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన సోమవారం పట్టణంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కోటవురట్ల మండలం ఎండపల్లి గ్రామానికి చెందిన వబ్బలరెడ్డి ప్రసాద్ నర్సీపట్నంలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రోజూ బైక్‌పై ఆఫీసుకు వెళ్లి వస్తుంటాడు. సోమవారం ఉదయం ప్రసాద్ బైక్‌పై ఎండపల్లి నుంచి నర్సీపట్నం ఆఫీసుకి బయలుదేరాడు. అదే గ్రామానికి చెందిన సుర్ల జమీలు నర్సీపట్నం వరకు లిఫ్ట్ అడిగాడు. మార్గమధ్యంలో కెన్విన్ స్కూల్ రోడ్డులో తన బైక్ ఉండి పోయిందని, లోపలికి తీసుకు వెళ్లాలని కోరాడు. కొద్ది దూరం వెళ్లిన తరువాత బైక్ వెనుక కూర్చున్న జమీలు సుత్తితో ప్రసాద్‌పై దాడి చేశాడు. కింద పడిపోయిన ప్రసాద్ చేతుల మీద కరిచి తీవ్రంగా గాయపరిచాడు. అతని నుంచి ప్రసాద్ తప్పించుకుని సమీపం లో కూలీలు పని చేస్తున్న చోటుకు పరుగెత్తాడు. దాడి చేసిన జమీలు పరారయ్యాడు. ప్రసాద్ ఏరియా ఆస్పత్రిలో వైద్యం చేయించుకొని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ముఖ పరిచయం తప్పితే ఇద్దరి మధ్య ఎటువంటి లావాదేవీలు, గొడవలు లేవని ప్రసాద్ చెప్పాడు. లిఫ్ట్ అడిగాడని బైక్ ఎక్కించుకుంటే ఎందుకు దాడి చేశాడో అర్థం కావడం లేదని తెలిపాడు. జమీలు ఓ బైక్ షోరూంలో పని చేస్తుంటాడని చెప్పాడు.

వ్యర్థ జలాలతో రైతులు విలవిల

రొయ్యల పరిశ్రమ బరితెగింపు

- పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోకి యథేచ్ఛగా వ్యర్థ జలాలు విడుదల
- భూగర్భ జలాలు కలుషితం
- నాశనమవుతున్న సమీపంలోని పంట పొలాలు
- దుర్వాసనతో జనం ఉక్కిరిబిక్కిరి
- పట్టించుకోని అధికారులు



రొయ్యల పరిశ్రమ పక్కనే ఖాళీ స్థలంలో పేరుకుపోయిన వ్యర్థ జలాలు



ధర్మవరం అగ్రహారంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న రొయ్యల పరిశ్రమ

ఎస్.రాయవరం, జూన్ 24: మండలంలోని ధర్మవరం అగ్రహారంలో జాతీయ రహదారికి పక్కనే ఉన్న కోస్టల్ రొయ్యల పరిశ్రమ యాజమాన్యం ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతోంది. వ్యర్థ జలాలను పరిశ్రమ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోకి విడిచిపెడుతుండడంతో భూగర్భ జలాలు కలుషితమై సమీపంలోని పంట పొలాలు నాశనమవుతున్నాయి. రైతులు పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

కోస్టల్ రొయ్యల పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. ఈ పరిశ్రమ యాజమాన్యం గతంలో వ్యర్థ జలాలను ట్యాంకర్ల ద్వారా బయటకు తరలించి దూర ప్రాంతాల్లో పారబోసేది. అయితే ఇటీవల వ్యర్థ జలాలను పరిశ్రమ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోకి విడిచిపెడుతోంది. దీని వల్ల తీవ్ర దుర్వాసన వెలువడి అటుగా రాకపోకలు

... మిగతా 8వ పేజీలో

తిమిరాంలో ఆక్రమణదారుల బరితెగింపు

- చెరువుల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీలపై దౌర్జన్యం
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితుల ధర్నా

- వార్త 7వ పేజీలో..

ఏయూ వీసీ ఇష్టారాజ్యం

- ఐదేళ్లలో 28కిపైగా కోర్సులు ఎత్తివేత
- ఆయా విభాగాల్లో పనిచేస్తున్న 250 గెస్ట్ ఫ్యాకల్టీ తొలగింపు
- ఆందోళన చేసినా పట్టించుకోని వైనం
- ఆ తరువాత కాలంలో కొన్నింటిని పునఃప్రారంభించినా ఎయిడెడ్ సిబ్బందితో నిర్వహణ



ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

విశాఖపట్నం, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి ఐదేళ్లు ఇష్టానుసారంగా వ్యవహరించారు. ఆయన వల్ల వందలాది మంది ఉద్యోగాలు కోల్పోయారు. వర్సిటీలో సుమారు 15, 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్న 250 మంది గెస్ట్ ఫ్యాకల్టీని వీసీ ప్రసాదరెడ్డి దశల వారీగా తొలగించి వారి పొట్ట కొట్టారు. దీనిపై నెలల తరబడి వారు పోరాటం సాగించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ఏయూలో 2020-2023 మధ్యకాలంలో 28కిపైగా విభాగాల్లో పనిచేస్తున్న 250 మంది గెస్ట్ ఫ్యాకల్టీని వీసీ తొలగించారు. ఇందుకోసం ఆయా కోర్సులనే ఆయన ఎత్తేశారు. ఈ జాబితాలో అత్యంత డిమాండ్ ఉన్న కోర్సులు ఉండడం గమనార్హం. మీడియా స్టడీస్, డిప్లొమో ఇన్ జర్నలిజం, హ్యూమన్ రైట్స్ డిపార్టుమెంట్, ఆర్కియాలజీ, అగ్రికల్చర్ టెక్నాలజీ, హార్టికల్చర్, ఎమ్మెస్సీ ఎకనామెట్రిక్స్ ఇంటిగ్రేటెడ్ జియాలజీ, ఫుడ్ అండ్ డ్రగ్స్ ఎన్విరాన్‌మెంట్ కెమిస్ట్రీ, న్యూక్లియర్ కెమిస్ట్రీ, మెరైన్ కెమిస్ట్రీ, న్యూక్లియర్ ఫిజిక్స్, స్పేస్ ఫిజిక్స్, డిప్లమో ఇన్ యోగా, ఎమ్మెస్సీ ఫిషరీస్, ఎమ్మెస్సీ జియాలజీ సహా పలు కోర్సులు రద్దయిన వాటిలో ఉన్నాయి. ఆయా విభాగాల్లో కనీసం ఇద్దరు నుంచి ఆరుగురు గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేవారు. వీరికి సెమిస్టర్ ప్రాతిపదికన వేతనాలు చెల్లించేవారు. సెమిస్టర్ సిలబస్ పూర్తిచేస్తే రూ.45 వేలు వేతనంగా చెల్లించేవారు. ఒక్కో సెమిస్టర్ పూర్తి చేయడానికి 90 రోజులు సమయం పడుతుంది. అంటే నెలకు కేవలం రూ.15 వేలు చొప్పున లభించేది. అయినప్పటికీ ఉద్యోగ భద్రత ఉంటుందన్న ఉద్దేశంతో ఎంతోమంది సంవత్సరాల తరబడి పనిచేస్తున్నారు. వీసీ ఒకే ఒక్క కలంపోటుతో వారి జీవితాలను రోడ్డునపడేశారు. తొలుత కోర్సులను ఎత్తేసిన అధికారులు...ఆ తరువాత కాలంలో కొన్నింటిని మళ్లీ ప్రారంభించారు. అయితే గెస్ట్ ఫ్యాకల్టీని మాత్రం తీసుకోలేదు. నిబంధనలకు విరుద్ధంగా వర్సిటీలోకి తెచ్చిన ఎయిడెడ్ ఫ్యాకల్టీ, ఇతరులతో ఆయా కోర్సులను నిర్వహిస్తున్నారు.

పెందుర్తిలో కలకలం

- అదీప్‌రాజ్ ఆస్పత్రిపాలు
- రకరకాలుగా ప్రచారం... ఖండించిన మాజీ ఎమ్మెల్యే



వీడియో విడుదల చేసిన అదీప్‌రాజ్

పెందుర్తి, జూన్ 24: పెందుర్తి మాజీ శాసనసభ్యుడు అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆస్పత్రి పాలవ్వడం నియోజకవర్గంలో కలకలం రేపింది. ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డారని సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేయడంతో పెందుర్తి ఉలిక్కిపడింది. అయితే ఆ ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఆదివారం రాంపురంలోని ఆయన స్వగృహంలో నియోజకవర్గ స్థాయి పార్టీ క్రియాశీలక కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. అందరికీ

... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

లాడ్జిలో వివాహిత ఆత్మహత్య

- ప్రాణం తీసిన వివాహేతర సంబంధం
- చనిపోవాలని ప్రియురాలిని ప్రేరేపించిన ప్రియుడు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



చింతకాయల భాగ్యలక్ష్మి (ఫైల్‌ఫొటో)

నర్సీపట్నం, జూన్ 24 : వివాహేతర సంబంధం వివాహిత ఆత్మహత్యకు కారణమైంది. ప్రియుడే ఆత్మహత్య చేసుకొని చనిపోవాలని ప్రియురాలిని ప్రేరేపించిన ఘటన నర్సీపట్నంలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్‌ఐ సుధాకరరావు, బంధువులు అందించిన వివరాలిలా ఉన్నాయి.

రాంబిల్లి మండలం కొత్తపట్నం గ్రామానికి చెందిన చింతకాయల రమణ భార్య భాగ్యలక్ష్మి(39) బ్రాండిక్స్ కంపెనీలో పని చేస్తున్నది. నర్సీపట్నం మునిసిపాలిటీలోని పెదబొడ్డేపల్లికి చెందిన ఆకుల అజయ్‌కుమార్ అదే కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ భాగ్యలక్ష్మితో పరిచయం పెంచుకొని వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. కొంతకాలం ఉద్యోగం చేసి అజయ్ మానేశాడు. అయినప్పటికీ ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతున్నది. ఈనెల 6 నర్సీపట్నంలోని ఒక ప్రైవేటు లాడ్జిలో ఇరువురు రూమ్ తీసుకున్నారు. రెండు, మూడు రోజులు ఉన్న తర్వాత ఖాళీ చేసి వెళ్లిపోయేవారు. అదేవిధంగా ఈనెల 17వ తేదీ నుంచి అదే లాడ్జిలో రూమ్ తీసుకొని ఇద్దరూ ఉండిపోయారు. ఆదివారం సాయంత్రం భాగ్యలక్ష్మి లాడ్జిలో ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. హుటాహుటిన ఆమెను ఏరియా ఆస్పత్రికి తీసుకు వెళ్లినప్పటికి అప్పటికే ఆమె మృతి చెందినట్టు డ్యూటీ డాక్టర్ నిర్ధారించారు. డబ్బు, బంగారం తీసుకురమ్మని భాగ్యలక్ష్మిని అడిగానని, తీసుకురాక పోతే ఆమెని చనిపొమ్మని తానే ప్రేరేపించానని అజయ్ పోలీసులకు ఇచ్చిన వాగ్మూలంలో అంగీకరించాడని ఎస్‌ఐ సుధాకరరావు తెలిపారు. తన భార్య డబ్బు, బంగారం తీసుకుపోయి అజయ్‌కి ఇచ్చేసేదని మృతురాలి భర్త రమణ చెప్పాడు. నెల రోజులుగా సరిగ్గా ఇంటికి కూడా రాలేదని తెలిపారు. ఇదిలా ఉండగా రమణ మొదటి భార్య, పిల్లలు ఉండగా.. భాగ్యలక్ష్మిని ద్వితీయ వివాహం చేసుకున్నాడు. భాగ్యలక్ష్మికి పిల్లలు కలగ లేదు. మొదటి భార్య అంగీకారంతో ముగ్గురు కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారని పోలీసులు తెలిపారు. నిందితుడు అజయ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సుధాకరరావు తెలిపారు.

అనారోగ్యంతో మారేడుపూడి ఎంపీటీసీ సభ్యుడి మృతి

అనకాపల్లి రూరల్, జూన్ 24: మండలంలోని మారేడుపూడి ఎంపీటీసీ సభ్యుడు ఈగల రామునాయుడు(45) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. సోమవారం ఉదయం సుమారు ఆరున్నర గంటల సమయంలో కడుపులో నొప్పిగా ఉందని ఆస్పత్రికి తీసుకువెళ్లాలని కుటుంబసభ్యులను కోరారు. వారు తీసుకువెళ్లేందుకు సిద్ధపడే లోపే మృతి చెందారు. గతంలో కాంగ్రెస్ హయాంలో సర్పంచ్‌గా ఆయన పనిచేశారు. ప్రస్తుతం టీడీపీ ఎంపీటీసీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఆయన సోదరుడు పెదబాబుతో పాటు అధిక సంఖ్యలో గ్రామస్థులు రామునాయుడు భౌతికాయానికి నివాళులు అర్పించారు. ఆయనకు భార్య దేవి, కుమారుడు కేశవ, కుమార్తె ఉన్నారు.

20 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

- కారు, రెండు ద్విచక్ర వాహనాలు సీజ్

పాడేరు రూరల్, జూన్ 24: మన్యం నుంచి మైదాన ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్న 20 కిలోల గంజాయిని సోమవారం స్వాధీనం చేసుకొని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి కారు, రెండు ద్విచక్రవాహనాలు సీజ్ చేసినట్టు సీఐ దేవరపల్లి నవీన్‌కుమార్ తెలిపారు. వాహన తనిఖీల్లో భాగంగా సోమవారం ఉదయం కందమామిడి జంక్షన్ వద్ద ఎస్‌ఐ జి.లక్ష్మణరావు బృందం వాహన తనిఖీలను నిర్వహిస్తుండగా ఉదయం 11 గంటల సమయంలో అటుగా వచ్చిన కారును నిలిపి తనిఖీ చేయగా అందులో 20 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకొని డ్రైవర్‌ను అరెస్టు చేసి కారు సీజ్ చేశామన్నారు. అదే విధంగా గంజాయి రవాణాకు సహకరించిన మరో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పట్టుబడిన నిందితులు జి.మాడుగుల మండలం బూరుగు గ్రామానికి చెందిన పాంగి కృష్ణారావు(30), జి.మాడుగుల మండలం గడ్డిరాయి గ్రామానికి చెందిన గొల్లోరి నారాయణ(24), విశాఖపట్నం ఆరిలోవ డైరీఫారం ప్రాంతానికి చెందిన అలజంగి పోలిరాజు (25)గా గుర్తించామన్నారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

అనకాపల్లి టౌన్, జూన్ 24 : అనకాపల్లి మండలం రామాపురం వద్ద సోమవారం ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో ఓ మహిళకు తీవ్ర గాయాలైనట్టు ట్రాఫిక్ ఎస్‌ఐ సోమశేఖరరావు తెలిపారు. మాడుగుల మండలం తాటిపర్తి గ్రామానికి చెందిన గట్టా పార్వతి, మరికొందరు ప్రయాణికులతో ఆటోలో అనకాపల్లి వైపు నుంచి స్వగ్రామం వెళ్తుండగా రామాపురం కాలనీ వద్ద లారీ ఢీకొనడంతో పార్వతి చేతికి బలమైన గాయాలయ్యాయన్నారు. ఆటో డ్రైవర్ శ్రీనుకు స్వల్పగాయాలయ్యాయని, గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

డీఆర్‌వోగా శ్రీనివాస్‌కు బాధ్యతలు

అనకాపల్లి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌వో)గా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్‌కు సోమవారం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో పనిచేసిన డీఆర్‌వో బలివాడ దయానిధి వ్యక్తిగత కారణాలతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారు. దీంతో కలెక్టరేట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా, గృహ నిర్మాణ సంస్థ పీడీగా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌కు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి.. డీఆర్‌వోగా ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కాంతులీనిన క్లాక్‌టవర్

- ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం
- నగరానికి సరికొత్త శోభ
- జగదాంబ కూడలికి స్పెషల్ అట్రాక్షన్



క్లాక్‌టవర్ కాంతులీనింది. జగదాంబ కూడలిలో నిర్మించిన క్లాక్‌టవర్‌కు అమర్చిన విద్యుత్ దీపాలను సోమవారం సాయంత్రం వెలిగించడంతో ఆ ప్రాంతమంతా ప్రత్యేక శోభను సంతరించుకుంది. ఉదయం స్తంభానికి నలువైపులా అమర్చిన గడియారాలను ప్రారంభించారు. సాయంత్రానికి మిగిలిన పనులు పూర్తిచేసి విద్యుత్ దీపాలను వెలిగించడంతో క్లాక్‌టవర్‌ను చూసేందుకు జనం ఉత్సాహం చూపించారు. ప్రారంభోత్సవం జరిగిన తరువాత ప్రత్యేక గంటల శబ్దం నగరవాసులను కొత్త అనుభూతికి గురిచేయనుంది.

- జగదాంబకూడలి

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

తిమిరాంలో ఆక్రమణదారుల బరితెగింపు



శీలావాని చెరువులో ఉపాధి పనులు అడ్డుకుంటున్న ఆక్రమణదారులు



తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు

- చెరువుల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీలపై దౌర్జన్యం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన వ్యక్తిని హత మారుస్తామని బెదిరింపులు
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధి కూలీల ధర్నా
- చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు వినతిపత్రాలు

దేవరాపల్లి, జూన్ 24: మండలంలోని తిమిరాం గ్రామ చెరువుల్లో సోమవారం ఉపాధి పనులు చేస్తున్న కూలీలపై ఆక్రమణదారులు దౌర్జన్యానికి దిగారు. పనులు చేయడానికి వీలు లేదంటూ కూలీలపై దాడి చేశారు. పనులు చేయకుండా ఉపాధి కూలీలకు అడ్డు తగిలారు. వివరాల్లోకి వెళితే...

తిమిరాం గ్రామంలో శ్రీరామ చెరువు, పనుకు బంద, కుమ్మరిగాత చెరువుల్లో ఉపాధి పనులు చేసేందుకు 150 మంది కూలీలు సోమవారం వెళ్లారు. ఉపాధి హామీ పథకం మేట్లు చెప్పిన ప్రకారం ఈ మూడు చెరువుల్లో పనులు చేస్తున్న కూలీలను పనులు చేయవద్దని ఆక్రమణదారులు అడ్డగించారు. వారి పనిముట్లను తీసుకున్నారు. తమను పని చేసుకోనివ్వమని కూలీలు కోరారు. అయినా ఆక్రమణదారులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ వారిపై దాడి తెగబడ్డారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలకు, ఆక్రమణదారుల మధ్య తోపులాట జరిగింది. ఆ సమయంలో అప్పలనాయుడు అనే ఉపాధి కూలీపై ఆక్రమణదారులు దాడి చేశారు. దీంతో పనులు ఆపేసిన ఉపాధి కూలీలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన ముసలినాయుడుని హత మార్చుతామని హెచ్చరించారు. నానా దుర్భాషలాడారు. దీంతో ఉపాధి కూలీలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. పనులు లేక చిన నందిపల్లి గ్రామాలకు వెళ్లేవారమని, గ్రామంలో ఉన్న చెరువుల్లోని ఆక్రమణలు తొలగించి పనులు కల్పించాలని తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ సుబ్బలక్ష్మి, ఉపాధి ఏపీఓ చంద్రకళకు వినతి పత్రాలు ఇచ్చారు. తాము ఈ భూముల్ని 1962 నుంచి సాగు చేస్తున్నామని, గ్రామంలో ఉన్న ఆక్రమణలన్నీ తొలగిస్తే స్వచ్ఛందంగా భూములను విడిచి పెడతామని ఆక్రమణదారులు విలేకరులకు తెలిపారు.

అభినందనల వెల్లువ



మంత్రి లోకేశ్‌కు అభినందనలు తెలుపుతున్న హోం మంత్రి అనిత



ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అనిత

రాష్ట్ర ఐటీ, విద్య, ఆర్టీజీ మంత్రిగా సోమవారం అమరావతిలోని సచివాలయంలో బాధ్యతలు చేపట్టిన నారా లోకేశ్‌కు హోం మంత్రి వంగలపూడి అనిత పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

జన్మభూమికి గ్రీన్‌సిగ్నల్

- సర్కార్ ఎక్స్‌ప్రెస్‌కు కూడా...
- నేటి నుంచే పునఃప్రారంభం
- రైళ్లు రద్దుపై విమర్శలు వెల్లువెత్తడంతో ఒక అడుగు వెనక్కి తగ్గిన అధికారులు
- సింహాద్రి, రత్నాచల్, ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లకు ఇంకా దక్కని ఊరట

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు డిమాండ్ పెంచుకోవడానికి సాధారణ ప్రయాణికులు ఎక్కువగా వెళ్లే రైళ్లను రద్దు చేస్తున్నారని తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో రైల్వే శాఖ ఒక అడుగు వెనక్కి తగ్గింది. విజయవాడ డివిజన్‌లో భద్రతా పరమైన తనిఖీలు నిర్వహిస్తున్న కారణంగా జూన్ 24 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు ఎనిమిది జతల రైళ్లను రద్దు చేస్తున్నట్టు రెండు రోజుల క్రితం ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రయాణికుల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు పునరాలోచించారు. ఆపరేషన్ల పేరుతో ఉన్నతాధికారులు రద్దు చేసిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌తో పాటు సర్కార్ ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరిస్తున్నట్టు సోమవారం ప్రకటించారు. ఇవి జూన్ 25వ తేదీ అంటే మంగళవారం నుంచే ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12805/12806) లింగంపల్లి-విశాఖపట్నం మధ్య నడుస్తుంది. అలాగే సర్కార్ ఎక్స్‌ప్రెస్ తమిళనాడులోని చెంగల్పట్టు నుంచి బయలుదేరి చెన్నై, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట మీదుగా కాకినాడ చేరుతుంది. దీనిని కూడా పునరుద్ధరించారు. ఇంకా విశాఖపట్నం-గుంటూరు మధ్య సింహాద్రి ఎక్స్‌ప్రెస్, విశాఖ-విజయవాడ మధ్య రత్నాచల్, విశాఖ-తిరుపతిల మధ్య డబుల్ డెక్కర్ రైళ్లను పునరుద్ధరించాల్సి ఉంది. వీటికి కూడా విపరీతమైన రద్దీ ఉంటుంది. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం నగరాల మధ్య తిరిగేవారు అత్యధికంగా ఈ రైళ్లనే ఆశ్రయిస్తారు. ఇవన్నీ కూడా వందేభారత్ రైలు బయలుదేరడానికి ఒక గంట అటుఇటుగా బయలుదేరేవి కావడం గమనార్హం. వీటిని రద్దు చేస్తే ఆ ప్రయాణికులు అంతా తప్పనిసరి స్థితిలో వందే భారత్‌ను ఆశ్రయిస్తారని, తద్వారా ఆక్యుపెన్సీ పెరిగి ఎక్కువ ఆదాయం వస్తుందనేది రైల్వే పెద్దల ఆలోచన. ఈ డిమాండ్‌ను చూపించి, అదనంగా మరికొన్ని వందేభారత్ రైళ్లు నడపాలన్నదే వారి ప్రణాళిక. గత ఏడాది జనవరి నుంచి సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య ఒక వందేభారత్ రైలు నడుస్తుండగా, మూడు నెలల క్రితం మరొకటి వేశారు. విజయవాడ-విశాఖపట్నం మధ్య కూడా వందే భారత్ ప్రారంభించే అవకాశం ఉందని రైల్వే ఉద్యోగుల సమాచారం. తక్కువ రేటుతో సామాన్యులు ప్రయాణించే రైళ్లను క్రమంగా రద్దు చేసి, ఎక్కువ ఆదాయం వచ్చే వందే భారత్ రైళ్లను తమ బ్రాండ్‌తో ప్రమోట్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఇదంతా చేస్తున్నదనే విమర్శలు ఉన్నాయి.

ప్రధానమైన రత్నాచల్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లనే కాకుండా గుంటూరు-రాయగడ పాసింజర్ రైలు, ఇటు విశాఖపట్నం-గుణుపూర్ రైళ్లను కూడా రద్దు చేశారు. అటు విజయవాడ నుంచి ఇటు శ్రీకాకుళం వరకు ఎంపీలు రైళ్ల రద్దు సమస్యను సీరియస్‌గా తీసుకొని, సామాన్య ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తక్షణమే దీనిపై ప్రతి ఎంపీ గొంతు విప్పాల్సిన అవసరం ఉంది.

అర్జీలపై తక్షణమే స్పందించాలి

ఎస్పీ కేవీ మురళీకృష్ణ



అర్జీదారునితో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి రూరల్, జూన్ 24: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలపై తక్షణమే స్పందించి అర్జీదారులకు న్యాయం చేయాలని అధికారులను ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశించారు. శంకరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీలను సంబంధిత అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం నిర్వహించిన ఈ కార్యక్రమంలో అందే ప్రతీ అర్జీపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఈ కార్యక్రమం ముగిసేసరికి 22 అర్జీలు అందగా, వాటిలో ప్రధానంగా భూ తగాదాలు, మోసాలు, కుటుంబ కలహాలు వంటి వాటిపై ఫిర్యాదులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ అప్పారావు, ఎస్‌ఐ దివ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా సంపద కేంద్రాలు



వృథాగా ఉన్న సూరెడ్డిపాలెం సంపద కేంద్రం



మందుబాబులకు అడ్డాగా మారిన వి.సంతపాలెం సంపద కేంద్రం

వృథాగా వదిలేసిన వైసీపీ ప్రభుత్వం

- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- కూటమి ప్రభుత్వం రాకతో మంచి రోజులు

కె.కోటపాడు, జూన్ 24 : వైసీపీ ప్రభుత్వ హయాంలో సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారిపోయాయి. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలు వృథాగా మారిపోయాయి. ప్రస్తుతం ఈ కేంద్రాలు మందుబాబులకు అడ్డా అయ్యాయి. అధికారులు వీటిని వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకోవడంతో విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కె.కోటపాడు మండల పరిధిలో 32 సంపద కేంద్రాలు ఉన్నాయి. ఒక్కొక్క సంపద కేంద్రానికి ఐదు నుంచి ఏడు లక్షల రూపాయల వరకు ఖర్చు చేశారు. ఈ సంపద కేంద్రాలను కొద్ది రోజులు తూతూ మంత్రంగా నిర్వహించి వదిలేశారు. తడి, పొడి చెత్తలను పారిశుధ్య కార్మికులు సంపద కేంద్రాలకు తరలించి అక్కడ ఎరువుగా తయారు చేసేవారు. అనంతరం ఆ ఎరువును రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరేది. కానీ వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి రాగానే సంపద కేంద్రాలకు వైసీపీ రంగులు వేసుకోవడానికే మాత్రమే ఉపయోగించారు. ఈ కేంద్రాలు వినియోగంలో లేకపోవడంతో కె.సంతపాలెం, సూరెడ్డిపాలెం తదితర కేంద్రాలు మందుబాబులకు అడ్డాగా మారాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సంపద కేంద్రాలకు మంచి రోజులు వస్తాయని పలువురు అంటున్నారు.

పూడిమడకలో అలల ఉధృతి

- ముందుకు వచ్చిన సముద్రం
- వలలను సురక్షిత ప్రాంతానికి తరలించిన మత్స్యకారులు



పూడిమడక తీరంలో అలల ఉధృతి

అచ్యుతాపురం, జూన్ 24: పూడిమడక తీరంలో సముద్రం బాగా ముందుకు వచ్చింది. సోమవారం మధ్యాహ్నం నుంచి అలల ఉధృతి ఎక్కువగా ఉండడంతో ఇళ్ల వరకు నీరు వచ్చేసింది. దీంతో మత్స్యకారులు అప్రమత్తమై వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పడవలు కూడా సురక్షితంగా ఉండడానికి చర్యలు చేపట్టారు. చీకటి పడే వరకు పూడిమడక తీరంలో అలల ఉధృతి కొనసాగింది.

ఆరోగ్యమిత్రల సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా గోవింద



సీహెచ్ గోవింద

అనకాపల్లి టౌన్, జూన్ 24: ఆరోగ్యమిత్రల సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా చవ్వాకుల గోవింద ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వైఎస్ భద్రం తెలిపారు. సంఘ సమావేశం విజయవాడలో ఆదివారం జరిగిందని తెలిపారు. అధ్యక్షునిగా గోవింద, ప్రధాన కార్యదర్శిగా గురవయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా దేవేంద్రనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వల్లూరి బంగారుశ్రీ ఎన్నికయ్యారన్నారు. కార్యదర్శులుగా సుధీర్, శేఖర్, ప్రభావతి, కృష్ణ, మూర్తి, కోశాధికారిగా రామ్మోహన్‌తో పాటు పలువురు కార్యవర్గసభ్యులను సమావేశంలో ఎన్నుకున్నారని పేర్కొంటూ వీరి ఎన్నిక పట్ల భద్రం హర్షం వ్యక్తం చేశారు.

మట్టి తవ్వకాలు జరిపిన పొలాల పరిశీలన

రాంబిల్లి, జూన్ 24: మండలంలోని కొత్తూరు, నారాయణపురం, చినకలవలాపల్లి, గోకివాడ గ్రామాల్లో మట్టి తవ్వకాలు జరిపిన పంట పొలాలను సోమవారం మైన్స్ అధికారులు పరిశీలించారు. మైన్స్ జిల్లా అధికారి ఆదేశాల మేరకు మైన్స్ అధికారిణి స్వాతి సిబ్బందితో మట్టి తవ్వకాలు జరిపిన ప్రదేశాలను, ఫిల్లింగ్ చేసిన ప్రదేశాలను పరిశీలించారు. మట్టి తవ్వకాలు జరుగుతున్న ప్రదేశాలను పరిశీలించి, ఎంత మేరకు మట్టి తవ్వకాలు జరిపారో కొలతలు తీశామని రాయల్టీ ఇన్‌స్పెక్టర్ స్వాతి తెలిపారు. ఈ మేరకు సదరు వ్యక్తులకు నోటీసులు జారీ చేసి అపరాధ రుసుము వసూలు చేస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు, మామిడివాడ రెవెన్యూ వీఆర్వోలు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

సింహాచలం, జూన్ 24 : వరాహలక్ష్మీనృసింహస్వామిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో ఎస్. కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఉన్నారు. ఎమ్మెల్యేలకు దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండప ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో ఎమ్మెల్యేల గోత్రనామాలతో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు శాలువతో సత్కరించి వేదాశీర్వచనాలను, స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

పట్టుదలతో ఐపీఎస్ సాధించా..

- ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ అయినా వెనకడుగు వేయలేదు
- సప్లిమెంటరీలో ఉత్తీర్ణుడినయ్యా..
- ఉచిత చదువుతోనే ఉన్నత స్థాయికి ఎదిగా..
- ఉత్తరప్రదేశ్ అడిషనల్ డీజీపీ కిల్లాడ సత్యనారాయణ



ఐపీఎస్ కిల్లాడ సత్యనారాయణకు జ్ఞాపిక అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ

కోటవురట్ల, జూన్ 24: ప్రభుత్వ పాఠశాలలోనే చదివి పట్టుదలతో ఐపీఎస్ సాధించానని ఉత్తరప్రదేశ్ అడిషనల్ డీజీపీ కిల్లాడ సత్యనారాయణ తెలిపారు. సోమవారం తాను చదువుకున్న పాములవాక హైస్కూల్‌ను తన కుమారుడు సుజన్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా 8, 9, 10 తరగతుల విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకుంటే ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని తెలిపారు. తాను ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని, అయితే కష్టపడి చదివి సప్లిమెంటరీలో ఉత్తీర్ణుడినయ్యానని చెప్పారు. డిగ్రీ అనకాపల్లి ఏఎంఎల్ కాలేజీ, పీజీ ఏయూలో చదివానని చెప్పారు. సివిల్స్ పరీక్ష కోసం ఏపీ స్టడీ సర్కిల్‌లో చదువుకున్నానన్నారు. తాను నర్సీపట్నం మండలం బలిఘట్టంలో స్కూల్ అసిస్టెంట్ టీచర్‌గా పని చేశానని, సివిల్స్ పరీక్షలో నాల్గవ ప్రయత్నంలోనే ఐపీఎస్ సాధించానని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యావకాశాలను సద్వినియోగం చేసుకుని ఈ స్థాయికి ఎదిగానని ఆయన తెలిపారు. ఆయనను పాఠశాల హెచ్‌ఎం కేవీ లక్ష్మీనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ అచ్యుతరావు సత్కరించారు.

పలు రైళ్లు రద్దు

విశాఖపట్నం, జూన్ 24: జబల్‌పూర్ సెక్షన్‌లో ప్రీ నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో విశాఖ నుంచి నడిచే పలు రైళ్లను రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల 27, జూలై 4న విశాఖ - భగత్ కి కోఠి ఎక్స్‌ప్రెస్ (18573), ఈనెల 29, జూలై 6న భగత్‌కి కోఠి - విశాఖ ఎక్స్‌ప్రెస్ (18574), జూలై 5, 6, 9న విశాఖ - అమృతసర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ (20807) రద్దు చేసినట్టు పేర్కొన్నారు. జూలై 6, 7, 10న అమృతసర్ - విశాఖ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ (20808) రైళ్లను రద్దు చేశారు. కాగా, విశాఖ నుంచి అమృతసర్ వెళ్లే హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు (20 807) ఈనెల 25, 28, 29, జూలై 2న మల్కెడి స్టేషన్ వద్ద హాల్ట్ ఉండదని పేర్కొన్నారు.

జూలై 20న సింహ గిరి ప్రదక్షిణ

- సింహాచలం ఈఓ శ్రీనివాసమూర్తి

సింహాచలం, జూన్ 24: లక్షలాదిమంది భక్తులు పాల్గొనే సింహగిరి ప్రదక్షిణ విజయవంతానికి ముందస్తు ప్రణాళికలతో కృషిచేద్దామని అధికారులకు సింహాచల దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సింగాల శ్రీనివాసమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి తన కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో గిరి ప్రదక్షిణకు చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం కొండచుట్టూ 30 స్టాల్స్ 275 టాయిలెట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గిరిప్రదక్షిణకు లక్షలాదిగా భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్టుగా కనీస వసతుల కల్పనపై అధికారులంతా దృష్టి సారించాలని ఆదేశించారు. నగరానికి చెందిన పలు ప్రభుత్వ శాఖలతో సమన్వయ పరచుకోవాలని, ఆయా శాఖలకు లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు. జూలై 20న సాయంత్రం 4గంటలకు స్వామివారి పుష్పరథం కొండదిగువ తొలిపావంచా వద్ద నుంచి ప్రారంభించడంతో గిరి ప్రదక్షిణ మొదలవుతుందన్నారు. ఉత్సవం జరుగు 20, 21 తేదీల్లో అప్పన్న ఆలయంలో అన్ని ఆర్జిత సేవలు రద్దు జరుగుతాయన్నారు. 20న ప్రదక్షిణ చేసి సింహగిరికి చేరుకునే భక్తులకు రాత్రి 10గంటల వరకు స్వామివారి దర్శనాలు కల్పిస్తామని, 21న సాయంత్రం నాలుగు గంటల వరకు మాత్రమే స్వామివారి దర్శనాలు లభిస్తాయని ఆలయ స్థానాచార్యులు డా.టిపి రాజగోపాల్ సమావేశంలో స్పష్టం చేశారు. ఉత్సవం విజయవంతానికి పోలీసు, జీవీఎంసీ, తదితర ప్రభుత్వ శాఖలతో త్వరలోనే సమన్వయ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో ఆలయ ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు, వెంకటరమణాచార్యులు పాల్గొన్నారు.

కొంగొత్త ఉత్సాహంతో కదిలిన ఎమ్మెల్యేలు

- అనకాపల్లి పట్టణం లో విస్తృతంగా పర్యటించిన కొణతాల రామకృష్ణ
- డంపింగ్ యార్డు తరలింపు, పెరుగుబజార్ రోడ్డు విస్తరణ తదితరాలపై అధికారులకు ఆదేశాలు


అనకాపల్లిలో డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కొణతాల రామకృష్ణ

అనకాపల్లి టౌన్, జూన్ 24 : ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి అనకాపల్లి వచ్చిన కొణతాల రామకృష్ణ సోమవారం మధ్యాహ్నం పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. జోనల్ కార్యాలయంలో ఉన్న డంపింగ్ యార్డును పరిశీలించారు. గతంలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు పరిశీలించిన స్థలాల్లో ఏదో ఒకచోటకి మార్పు చేయాలని జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడును ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న పెరుగుబజార్ రోడ్డు విస్తరణ పనులను పరిశీలించి, తక్షణమే రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలన్నారు. ఇందుకు అవసరమైన నిధులను సమకూర్చుతామని చెప్పారు. అలాగే బాధితులకు టీడీఆర్‌లు ఇవ్వాలన్నారు. యల్లయ్య కాలువను పరిశీలించి వర్షాలు కురవక ముందే పూడికలను తొలగించాలన్నారు. రైల్వే బ్రిడ్జికి కూడా మరమ్మతులు చేయించి శుభ్రపరచాలన్నారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రవి, జీవీఎంసీ రెవెన్యూ ప్రతినిధి ఎం.శేఖర్, డీఈ వేణుగోపాలరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన వివిధ శాఖల అధికారులు

కొత్తూరు: ఇక్కడి రింగురోడ్డులో ఉన్న జనసేన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను పలు శాఖలకు చెందిన అధికారులు, కూటమి నేతలు కలిశారు. జిల్లా దేవదాయ, ధర్మాదాయ శాఖకు చెందిన అధికారులు, ఎన్ఆర్ఈజీఎస్, అనకాపల్లి పట్టణ పోలీసులు, జీవీఎంసీ జోన్ -7కు చెందిన ఇంజనీరింగ్ విభాగం అధికారులు, కశింకోట మండలానికి చెందిన కూటమి నేతలు, అనకాపల్లికి చెందిన జనసేన, టీడీపీ, బీజేపీ నేతలు కలిసి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర తెలుగురైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, తాళ్ళపాలెం జనసేన నేత కర్రి వెంకట సత్యనారాయణ, బీజేపీ నేతలు చదరం నాగేశ్వరరావు, కర్రి రామకృష్ణ, అరుగల్లు కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

- పారిశ్రామిక ప్రాంతంపై విజయకుమార్ ప్రత్యేక దృష్టి
- భవన యజమానులు, వ్యాపారులతో సమావేశం
- అచ్యుతాపురం జంక్షన్‌ను సుందరంగా తీర్చిదిద్దేందుకు అంతా సహకరించాలని విజ్ఞప్తి


భవన యజమానులు, వ్యాపారుల సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్

అచ్యుతాపురం, జూన్ 24 : పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురం జంక్షన్‌ను అంతర్జాతీయ అతిథులు మెచ్చేలా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యమని, ఇందుకు అంతా సహకరించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. సోమవారం ఇక్కడ అచ్యుతాపురం జంక్షన్‌లోని భవన యజమానులు, వ్యాపారులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)లో నిర్మించిన కర్మాగారాలకు తరచూ వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు, అతిథులు వస్తుంటారన్నారు. వీరంతా అచ్యుతాపురం జంక్షన్ వచ్చే సరికి ముక్కుమూసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ముందుగా అచ్యుతాపురం జంక్షన్‌ను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దాలని భావిస్తున్నట్టు చెప్పారు. జంక్షన్‌లో కాలువల పరిస్థితి చాలా దారుణంగా ఉందని, దీనిని భవన యజమానులే సరిచేయాలన్నారు. జంక్షన్‌లో రోడ్డుపక్కనున్న భవనాల యజమానులు పలువురు షాపులు, తోపుడు బండ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లకు అద్దెలకిస్తున్నారన్నారు. వీరు ఆయా వ్యర్థాలను కాలువల్లో వేయడం వల్ల ఎంత శుభ్రం చేసినప్పటికీ కాలువలు పూడుకుపోతున్నాయని పేర్కొన్నారు. అవసమైన చోట డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే జంక్షన్‌లో రోడ్డు పక్కన ఉన్న భవనాలు, షాపుల ముందు వాహనాలు నిలిపేందుకు వీలుగా పెయింట్‌తో లైన్లు ఏర్పాటు చేయాలని ఎస్ఐ నారాయణరావుకు సూచించారు. ఆయా గీతలు దాటి బయటకు వచ్చే వాహనాలపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ బి.సరోజిని, ఎంపీడీవో సురేష్ కుమార్, నాయకులు బైలపూడి శ్రీరామదాసు, దర్శిరెడ్డి నాయుడు బాబు (డ్రీమ్స్ నాయుడు), పల్లి శేష గిరిరావు, పుర్రే శ్రీనివాస యాదవ్, కూనిశెట్టి రమణ, కొయ్య శ్రీనివాసరావు, ద్వారపురెడ్డి బాపూజీ, డి.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాంబిల్లిలో పైడితల్లమ్మ జాతర



రాంబిల్లి, జూన్ 24 : మండల కేంద్రం రాంబిల్లిలో పైడితల్లమ్మ జాతర మంగళవారం జరుగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. వేకువజాము నుంచి అమ్మవారికి విశేష పూజలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా గ్రామాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావాల్సిందిగా కమిటీ సభ్యులు కోరారు.

భీమవరంలో సోలార్ లైట్లు ప్రారంభం


లైట్లను ప్రారంభిస్తున్న ఎంపీపీ లోవలక్ష్మి

ఎస్.రాయవరం, జూన్ 24 : భీమవరం గ్రామ ప్రధాన రోడ్డు మార్గంలో నూతంగా ఏర్పాటుచేసిన సోలార్ లైట్లను సోమవారం ఎంపీపీ కోన లోవలక్ష్మి ప్రారంభించారు. ఎంపీ నిధులతో ప్రధాన రహదారికి ఇరువైపులా పదహారు సోలార్ లైట్లను ఏర్పాటు చేసినట్టు సర్పంచ్ గరగా నూకరాజు తెలిపారు. వైసీపీ నాయకుడు శ్రీను, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకులను పరిశీలించిన ఎంపీడీవో


నీటిలో క్లోరినేషన్ శాతం పరిశీలిస్తున్న ఎంపీడీవో

కొత్తూరు, జూన్ 24 : పిసినికాడ, సంపతిపురం గ్రామాల్లో ఉన్న తాగునీటి ట్యాంకులను ఎంపీడీవో మోహన్ కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి శాంపిల్స్‌ను తీసి వాటిలో ఉన్న క్లోరినేషన్ శాతాన్ని పరీక్షించారు. ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయడతో పాటు శుభ్రం చేయాలని సూచించారు. అంటు వ్యాధులు ప్రబలకుండా కార్యదర్శులంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

వేగి వీధిలో విద్యుత్ సమస్యపై ఏఈకి వినతి


ఏఈకి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, జూన్ 24 : గవరపాలెం వేగివీధిలోని విద్యుత్ సమస్య పరిష్కరించాలని కోరుతూ 81వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి మళ్ల సురేంద్ర ఆధ్వర్యంలో స్థానికులు సోమవారం ఈపీడీసీఎల్ ఏఈ రాజేంద్రప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్యల వల్ల తమ ప్రాంతవాసులు విద్యుత్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. మాజీ కౌన్సిలర్ వేగి లక్ష్మి, కృష్ణ, సూరిబాబు, ఆడారి సూరిఅప్పారావు పాల్గొన్నారు.

'ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి'

పాయకరావుపేట, జూన్ 24 : మెగా డీఎస్సీలో ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులను కూడా భర్తీ చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సుమారు 16వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు మెగా డీఎస్సీ ప్రకటించడం అభినందనీయమన్నారు. అయితే దివ్యాంగుల కోటాలో 6,800 ప్రత్యేక ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాల్సిన విషయాన్ని మరిచారన్నారు. ఇప్పటికైనా సీఎం ఈ అంశంపై దృష్టి సారించాల్సిందిగా కోరారు.

పోలీస్ శాఖకు స్టాపర్ బోర్డులు అందజేత


స్టాపర్‌బోర్డులు అందజేస్తున్న రామ్‌కో ప్రతినిధులు

అనకాపల్లి రూరల్, జూన్ 24 : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు రామ్‌కో సిమెంట్ లిమిటెడ్ కంపెనీ స్టాపర్ బోర్డులను అందజేసినట్టు ఎస్పీ కేవీ మురళీకృష్ణ సోమవారం తెలిపారు. కశింకోట మండలం ఏఎస్‌పేటలో ఉన్న సదరు కంపెనీ సీఎస్ఆర్ నిధుల్లో భాగంగా వీటిని సమకూర్చినట్టు చెప్పారు. రోడ్డు ప్రమాదాలు తరుచూ సంభవించే (బ్లాక్ స్పాట్) వద్ద వీటిని ఏర్పాటు చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. అలాగే ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కూడా ఇవి ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ అప్పలరాజు, కంపెనీ యూనిట్ హెడ్ పి.వీరపాండ్యన్, అడ్మిన్ హెడ్ కళాధరరావు పాల్గొన్నారు.

సాగునీటి వనరుల ఆక్రమణలు తొలగించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

నక్కపల్లి, జూన్ 24 : చినదొడ్డిగల్లు రెవెన్యూ పరిధిలో పరగణం చెరువుతో పాటు పలు గెడ్డలు, కాలువల ఆక్రమణలు తొలగించాలని పలువురు రైతులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన పలువురు రైతులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. పరగణం చెరువుతో పాటు రెవెన్యూ పరిధిలోని పలు గెడ్డలు, సాగునీటి కాలువలు ఆక్రమణల కారణంగా పంటభూములకు అవసరమైన సమయంలో సక్రమంగా సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- వివిధ శాఖల సిబ్బంది సమావేశంలో ఎంపీడీవోలు ఆదేశం


పరవాడలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో కీర్తి స్పందన


సబ్బవరంలో ఇన్‌చార్జి ఎంపీడీవో మహేశ్, వివిధ శాఖల సిబ్బంది సమావేశం

పరవాడ, జూన్ 24 : వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులంతా అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంపీడీవో కీర్తి స్పందన సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, హెల్త్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలన్నారు. డెంగ్యూ మలేరియా జ్వరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో గల రక్షిత మంచినీటి పథకాల ట్యాంక్‌లను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ జి.షణ్ముక, ఏవో రాంబాబు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ అచ్యుతరావు, ఎంఈవో సాయి శైలజా తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : వర్షాకాలం ఆరంభం కావడంతో గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా అంతా అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీవో మహేశ్ సూచించారు. సోమవారం ఇక్కడ వైద్య సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ, పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. తాగునీటి పథకాల ట్యాంకులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎప్పటికప్పుడు వాటిని క్లోరినేషన్ చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామాలను పరిసరాల పరిశుభ్రతపై చైతన్యవంతులను చేయాలని సూచించారు. అతిసార వ్యాధి ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పీహెచ్‌సీ ప్రధాన వైద్యులు డాక్టర్ చక్రవర్తి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సమాశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హిమబిందు, డాక్టర్ చక్రవర్తి, ఎంఈవో లక్ష్మణరావు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు అధికారులతో హోం మంత్రి అనిత సమీక్ష

పాయకరావుపేట, జూన్ 24 : మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో మంగళవారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సమీక్షా సమావేశం నిర్వహించనున్నారని ఎంపీడీవో కె.స్వప్న తెలిపారు. స్థానిక పంచాయతీరాజ్‌శాఖ అతిథి గృహంలో ఉదయం పది గంటలకు నిర్వహించే సమీక్షా సమావేశానికి అన్ని ప్రభుత్వశాఖల అధికారులు తమ శాఖకు సంబంధించి పూర్తి అప్‌డేట్ సమాచారంతో తప్పకుండా హాజరుకావాలని ఆమె కోరారు.

63 మందికి కంటి పరీక్షలు



కంటి రోగులను పరీక్షస్తున్న వైద్యుడు గణపతిరావు

ఎలమంచిలి, జూన్ 24 : పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో గల జనసేవ ఉచిత కంటి ఆస్పత్రి ఆవరణలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 63 మంది కంటి రోగులకు లయన్స్ క్లబ్ సభ్యులు, నేత్ర వైద్యాధికారి మజ్జి గణపతిరావు బృందం పరీక్షలు జరిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో ఇరవై మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసి తరలించారు. క్లబ్ అధ్యక్షులు డాక్టర్ కుర్రా శంకర్ గిరి, కార్యదర్శి కట్టా బాబ్జీ, స్థానిక విజ్జు డెంటల్ వైద్యాధికారి పి.సింహాద్రి నాయుడు,కరణం అంజనేయులు, పోలీస్ రాజు, ద్వారపురెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గెడ్డవాగు ఆక్రమణ తొలగించాలని వినతి

సబ్బవరం, జూన్ 24 : మండలంలోని ఇరువాడ గ్రామంలో కోట్ల రూపాయలు విలువ చేసే గెడ్డ వాగును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన బలిరెడ్డి అప్పారావు కోరారు. ఈ మేరకు సోమవారం అనకాపల్లిలో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఆక్రమణ అంశాన్ని గతంతో రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. అంతకుముందు టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీని కలిసి ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని విన్నవించారు.

వరహా నదిలో గ్రోయిన్ నిర్మించాలంటూ సీపీఎం జల దీక్ష



వరహానదిలో జలదీక్ష చేస్తున్న సీపీఎం నాయకులు

ఎస్.రాయవరం, జూన్ 24 : మండలంలోని ధర్మవరం వద్ద వరహా నదిలో కొట్టుకుపోయిన గ్రోయిన్‌ను వెంటనే నిర్మించాలంటూ సీపీఎం నాయకులు సోమవారం ఇక్కడి నదిలో జల దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ మూడేళ్ల క్రితం నది ఉధృతికి ధర్మవరం వద్ద గ్రోయిన్ కొట్టుకుపోవడంతో అప్పటి నుంచి లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రంలో కలిసి పోతోందన్నారు. దీంతో ఎస్.రాయవరం, లింగరాజుపాలెం, కర్రివానిపాలెం, వెంకటాపురం, ఉప్పరాపల్లి, వాకపాడు, సర్వసిద్ధి, సైతారుపేట, పేటసూదిపురం గ్రామాల్లో గల ఆరు వేల ఎకరాల సాగు భూములకు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అయినప్పటికీ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ ఎం సత్యనారాయణ, నాయకులు ఎం.రాజేష్, ఎం.రమణ, శ్రీను, శివ, బన్ని, సాయి, సత్తిబాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కన్నబాబు భూకబ్జాలపై విచారణ జరపండి

- తహసీల్దార్‌కు మత్స్యకార నాయకుడు మేరుగు రాజుబాబు వినతి


తహసీల్దార్‌కు వినతిని అందిస్తున్న రాజుబాబు

అచ్యుతాపురం, జూన్ 24 : ఎలమంచిలి మాజీ ఎమ్మెల్యే కన్నబాబు రాజు అధికారంలో ఉండగా చేసిన భూ కబ్జాలపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని పూడిమడకకు చెందిన మత్స్యకార నాయకుడు మేరుగు రాజుబాబు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ సరోజినికి వినతి పత్రాన్ని అందజేశారు. పూడిమడక తీరంలో డి.పట్టా భూమిని అధికారంతో కాజేసి ఉప్పుటేరుపై వంతెన నిర్మించి తన భూమికి దర్జాగా రోడ్డు వేసుకున్నారని ఆరోపించారు. అలాగే, కొండకర్ల ఆవ ప్రాంతంలో కూడా ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని అతిథి గృహం నిర్మించుకున్నారని పేర్కొన్నారు. వీటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

'విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం'


కశింకోటలో విద్యార్థినికి పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, జూన్ 24 : రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వనుందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. అచ్యుతాపురం ఉన్నత పాఠశాలను ఈ విద్యా సంవత్సరం నుంచి హైస్కూల్ ప్లస్‌గా అప్ గ్రేడు చేశారు. ఈ నేపథ్యంలో ఇంటర్ తరగతుల నిర్వహణకు అవసరమైన అదనపు గదులను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. రానున్న రోజుల్లో విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ప్రస్తుతం ఇక్కడ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులకు అనుమతి ఇచ్చినట్టు చెప్పారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఎంఈవో దేవరాయలు, బైలపూడి శ్రీరామదాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు, డ్రీమ్స్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : ఇక్కడి బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు సోమవారం పుస్తకాలు, బ్యాగుల పంపిణీ చేపట్టారు. టీడీపీ నాయకుడు కాండ్రేగుల సతీష్‌తో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు. అలాగే, తాళ్లపాలెం పంచాయతీ బంగారయ్యపేట ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. కూటమి నాయకులు ఉల్లింగల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేటపేట రూరల్: గుంటపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో డీసీసీబీ మాజీ డైరెక్టర్, జనసేన నాయకులు గెడ్డం కన్నబాబు సోమవారం విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ గట్టెం దొరబాబు, హెచ్ఎం రామారావు, మాజీ ఎంపీటీసీ పల్లి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ


నక్కపల్లి మండలం దొంకాడలో విత్తనాల పంపిణీ

నక్కపల్లి, జూన్ 24 : దొంకాడలో రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. సర్పంచ్ చందిన కొండలరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ తదితరులు రైతులకు వరి విత్తనాలను అందజేశారు. ఏఈఓ సత్యనారాయణతో పాటు నాయకులు కోసూరు శ్రీనివాసరావు, వెలగా సుధాకర్, కొప్పిశెట్టి కొండబాబు, బుజ్జి, వెలగా శ్రీనివాస్, మాణిక్యం, బుజ్జి, దివాణం, రాఘవ, నానాజీ, రమణ, సత్యనారాయణ, గింజాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల : ఇక్కడి రైతు భరోసా కేంద్రంలో రైతులకు రాయితీపై విత్తనాల పంపిణీ ప్రారంభమైంది. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, పార్టీ మండల అధ్యక్షులు జానకి శ్రీనివాసరావులు రైతులకు వీటిని అందజేశారు. ఏవో సరోజనితో పాటు కూటమి నాయకులు వేచలపు జనార్దన్, బీకేపల్లి లింగంనాయుడు, సింగంపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: బయ్యవరంలో రైతులకు విత్తనాలను సోమవారం పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖాధికారులతో పాటు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్కే బాబర్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గొల్లవిల్లి ప్రవీణ్, మహిళా అధ్యక్షురాలు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


కోటవురట్లలో...

అనకాపల్లి రూరల్ : గొలగాం పంచాయతీలో సోమవారం రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారి విజయ్, ఎంపీటీసీ నారపిన్ని చంద్రశేఖర్, టీడీపీ నాయకుడు తలారి కాశీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వాడకంతో ముప్పు

- పాయకరావుపేట సీఐ అప్పలరాజు


పాయకరావుపేట ప్రభుత్వ కళాశాలలో మాట్లాడుతున్న సీఐ అప్పలరాజు

పాయకరావుపేట, జూన్ 24 : ఎన్నో అనర్థాలకు కారణయ్యే మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సీఐ పి.అప్పలరాజు అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాలు వాడితే బంగారు భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. ఎస్ఈబీ సీఐ ఎస్.ధర్మారావు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.దేవన్నతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తూరు : మాదక ద్రవ్యాల బారిన పడితే జీవితానికి ముప్పు అని ప్రతి ఒక్కరూ గమనించాలని పరివర్తన జిల్లా డిఎడిక్షన్ సెంటర్ ఇన్‌చార్జి సూర్యప్రకాశరావు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య వినియోగ, రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం ఏఎంఏఎల్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మాదక ద్రవ్యాలు వాడడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జయబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహేశ్వరరావు, కో-ఆర్డినేటర్ శివాజీ, పుష్ప, సాయి తదితరులు పాల్గొన్నారు.

స్వాహారాయుళ్లలో టెన్షన్

... 5వ పేజీ తరువాయి

సామాజిక తనిఖీ విభాగాన్ని మరింత పటిష్టం చేయడంతో పాటు, పనులపై విచారణలను కూడా పకడ్బందీగా నిర్వహించేలా కార్యాచరణ రూపొందించే ప్రయత్నంలో ఉండడం ఇప్పుడు అక్రమార్కుల్లో గుబులు రేపుతున్నది. గత ఐదేళ్లలో ఉపాధి నిధులతో జరిగిన పనుల్లోని లోపాలు, అవకతవకలపైనా కూడా సమగ్ర విచారణ జరిపించే ప్రయత్నంలో ఉండడంతో ఉపాధి పనులు చేయించిన సిబ్బంది, అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

పెందుర్తిలో కలకలం

... 5వ పేజీ తరువాయి

వెన్నుదన్నుగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో తెల్లవారేసరికల్లా ఆయన ఆస్పత్రిలో ఉన్నారని వార్తలు రావడం చర్చనీయాంశమైంది. ఈ విషయమై రకరకాల కథనాలు ప్రచారం జరగడంతో సోమవారం సాయంత్రం ఆయన వీడియో విడుదల చేశారు. సోమవారం తెల్లవారుజామున మూడు గంటలు సమయంలో గ్యాస్ట్రిక్ పెయిన్ రావడంతో కుటుంబసభ్యులు నగరంలోని ఆస్పత్రిలో చేర్పించారని, ప్రస్తుతం తాను డిశ్చార్జి అయ్యి ఆరోగ్యంగానే ఉన్నానని పేర్కొన్నారు. ఆత్మహత్యకు పాల్పడ్డాడని విష ప్రచారం చేశారని అవన్నీ అవాస్తవాలన్నీ కొట్టిపారేశారు.

వ్యర్థ జలాలతో రైతులు విలవిల

... 5వ పేజీ తరువాయి

సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు భూగర్భ జలాలు కలుషితమై సమీపంలోని పంట పొలాలు నాశనమవుతున్నాయి. ఈ వ్యర్థ జలాల నుంచి వెలువడే దుర్వాసన వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. దీనిపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రొయ్యల పరిశ్రమ యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



ధర్మవరం అగ్రహారంలో ఉన్న రొయ్యల పరిశ్రమ యాజమాన్యం స్థానిక ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకుంటాం. పరిశ్రమలో వ్యర్థ జలాలను రీసైక్లింగ్ పద్ధతిలో శుద్ధి చేసి బయటకు విడిచిపెట్టాలి. అలా కాకుండా వ్యర్థ జలాలను నేరుగా బయటకు విడిచి పెట్టకూడదు. ఆ పరిశ్రమ వద్దకు వెళ్లి పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

- జి.సత్యనారాయణ, ఈవోపీఆర్‌డీ, ఎస్.రాయవరం మండలం

నర్సీపట్నం
నియోజకవర్గం

'సీజనల్ వ్యాధులపై అప్రమత్తం కండి'


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రత్నకుమారి

గొలుగొండ, జూన్ 24 : వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అంతా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రత్నకుమారి సూచించారు. సోమవారం ఇక్కడ ఏర్పాటైన వివిధ శాఖల అధికారుల సమావేశంలో మాట్లాడారు. ఎక్కడా నీటినిల్వలు లేకుండా చూడాలన్నారు. పలు గ్రామాల్లో డెంగ్యూ, మలేరియా వంటివి సోకుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆయా గ్రామాలకు వెంటనే వెళ్లి వైద్య సేవలు అందించాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఎంఈవో సత్యనారాయణ, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్యామ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అల్లూరి పార్కు సమీపంలో వంతెనపై రెయిలింగ్ కూలడంతో భయం..భయం..


వంతెనపై కూలిన రక్షణ రెయిలింగ్

కృష్ణాదేవిపేట; జూన్ 24 : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి సీతారామరాజు పార్కు సమీపంలో గల వంతెనపై రక్షణగా ఏర్పాటు చేసిన రెయిలింగ్ ఓ వైపు కూలడంతో వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. ఇక్కడ నెలలు తరబడి ఈ సమస్య ఉన్నా అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదు. ఈ మార్గంగుండా నిత్యం శరభన్నపాలెం, చింతపల్లి, పాడేరు తదితర ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇటువంటి సమయంలో డ్రైవర్లు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా పెను ప్రమాదం తప్పదని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి రెయిలింగ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

ప్రతి సమస్యకు పరిష్కారం

- సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహణ
- అర్జీలు స్వీకరించిన ఆర్డీవో జయరాం
- క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం చేయాలని అధికారులకు సూచన


అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం, జూన్ 24 : ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి తొమ్మిది మంది వచ్చి అర్జీలను సమర్పించారు. ప్రతి ఒక్కరితో ఆర్డీవో హెచ్‌వీ జయరాం స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తన పొలంలో పది తాటి చెట్లు నరికేశారని, నష్ట పరిహారం ఇప్పించాలని నర్సీపట్నం మండలం అమలాపురం సర్పంచ్ శెట్టి సాంబమూర్తి కోరారు. ప్రైవేటు పాఠశాలలో అధిక ఫీజులు, పుస్తకాలు విక్రయాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి రమణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. పెదబొడ్డేపల్లిలో రహదారిలో గోడ నిర్మించారని, సంబంధిత వ్యక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని చంద్రయాణి అనే మహిళ విన్నవించారు. అనంతరం అధికారులతో జరిగిన సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, తగు న్యాయం చేయాలని సూచించారు.

నేరాలకు పాల్పడితే శిక్షలు కఠినం

- అదనపు జూనియర్ సివిల్ జడ్జి మధుసూదనరావు స్పష్టీకరణ
- సబ్ జైలు సందర్శన


రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి మధుసూదనరావు

నర్సీపట్నం, జూన్ 24 : కొత్త చట్టాలు జూలై ఒకటో తేదీ నుంచి అమలులోకి రానున్నాయని, ఇకపై నేరాలకు పాల్పడితే శిక్షలు చాలా కఠినంగా ఉంటాయని నర్సీపట్నం అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మధుసూదనరావు అన్నారు. సోమవారం ఇక్కడి సబ్ జైలును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జైలులోని 30 రిమాండ్ ఖైదీలనుద్దేశించి మాట్లాడారు. ఎన్నాళ్లుగా రిమాండ్‌లో ఉంటున్నారు, ఏ నేరం చేసి వచ్చారు తదితర వివరాలు తెలుసుకున్నారు. బెయిల్ పెట్టుకునే స్తోమత లేని రిమాండ్ ఖైదీలకు మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం చేస్తామని వివరిచారు. వచ్చేనెల ఒకటో తేదీ నుంచి కొత్త చట్టాలు అమలులోకి రాబోతున్నాయని వివరించారు. నేరం చేసి జైలుకు వస్తే బెయిల్ దొరకడం కూడా కష్టమవుతుందన్నారు. నేరాల జోలికి ఎవరూ పోకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

గాయపడిన టీడీపీ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే 'బోళెం' పరామర్శ


ఇటంశెట్టిని పరామర్శిస్తున్న ముత్యాల పాప

నాతవరం, జూన్ 24 : రోడ్డు ప్రమాదంలో గాయాలకు గురైన టీడీపీ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఇటంశెట్టి సీతారామ్మూర్తిని సోమవారం నాతవరంలో మాజీ ఎమ్మెల్యే బోళెం ముత్యాల పాప, వెంకటరమణమూర్తి దంపతులు పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. చింతకాయల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'సర్వే ద్వారా బడి బయట పిల్లలను గుర్తించండి'


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో జాన్ లింకన్

నర్సీపట్నం, జూన్ 24 : సమగ్ర సర్వే ద్వారా బడి బయట పిల్లలను గ్రామ కమిటీలు గుర్తించాలని ఎంపీడీవో జాన్ లింకన్ అన్నారు. సోమవారం 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా ఇక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్, హెచ్‌ఎం, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్త, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు గ్రామ కమిటీలో సభ్యులుగా ఉంటారన్నారు. ఆరు నుంచి పద్నాలుగు సంవత్సరాల వయస్సు గల పిల్లలు పాఠశాలలో ఉండాలన్నారు. ప్రభుత్వం పాఠశాలలో మౌలిక సదుపాయాలు, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్ అందించడంతో పాటు మధ్యాహ్న భోజనం వంటి పథకాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఎంఈవోలు తపులుపులు, నాగేంద్ర, సీఆర్ఎండీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలకు ప్రైవేటు పాఠశాలలు అడ్వాన్స్ చెల్లించాలి : ఎంఈవో


ప్రైవేటు పాఠశాలల యాజమాన్యుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో అమృతకుమార్

నాతవరం, జూన్ 24 : ప్రైవేటు పాఠశాలల యాజమాన్యులు పాఠ్య పుస్తకాల కోసం ఐదు శాతం అడ్వాన్స్‌గా ప్రభుత్వానికి చెల్లించాలని ఎంఈవో టి.అమృతకుమార్ తెలిపారు. సోమవారం ఇక్కడ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం విద్యార్థులకు ఫీజు లేకుండా ఉచితంగా ప్రవేశాలు కల్పించాలన్నారు. వీరిని లాటరీ ద్వారా ఎంపిక చేయాలన వివరించారు. నాతవరం మండలంలో వివిధ ప్రభుత్వ పాఠశాల్లో చదివే 4,790 మంది విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు అందజేసినట్టు చెప్పారు. త్వరలో అందరికి యూనిఫాం కూడా అందిస్తామని వివరించారు. ఈ సమావేశంలో ఎంఈవో-2 కామిరెడ్డి వరహాల బాబు, సీఆర్‌పీలు పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వాహారాయుళ్లలో టెన్షన్

... 5వ పేజీ తరువాయి

సామాజిక తనిఖీ విభాగాన్ని మరింత పటిష్టం చేయడంతో పాటు, పనులపై విచారణలను కూడా పకడ్బందీగా నిర్వహించేలా కార్యాచరణ రూపొందించే ప్రయత్నంలో ఉండడం ఇప్పుడు అక్రమార్కుల్లో గుబులు రేపుతున్నది. గత ఐదేళ్లలో ఉపాధి నిధులతో జరిగిన పనుల్లోని లోపాలు, అవకతవకలపైనా కూడా సమగ్ర విచారణ జరిపించే ప్రయత్నంలో ఉండడంతో ఉపాధి పనులు చేయించిన సిబ్బంది, అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

పెందుర్తిలో కలకలం

... 5వ పేజీ తరువాయి

వెన్నుదన్నుగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో తెల్లవారేసరికల్లా ఆయన ఆస్పత్రిలో ఉన్నారని వార్తలు రావడం చర్చనీయాంశమైంది. ఈ విషయమై రకరకాల కథనాలు ప్రచారం జరగ డంతో సోమవారం సాయంత్రం ఆయన వీడియో విడుదల చేశారు. సోమవారం తెల్లవారుజామున మూడు గంటలు సమయంలో గ్యాస్ట్రిక్ పెయిన్ రావడంతో కుటుంబసభ్యులు నగరంలోని ఆస్పత్రిలో చేర్పించారని, ప్రస్తుతం తాను డిశ్చార్జి అయ్యి ఆరోగ్యంగానే ఉన్నానని పేర్కొన్నారు. ఆత్మహత్యకు పాల్పడ్డాడని విష ప్రచారం చేశారని అవన్నీ అవాస్తవాలన్నీ కొట్టిపారేశారు.

వ్యర్థ జలాలతో రైతులు విలవిల

... 5వ పేజీ తరువాయి

సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు భూ గర్భ జలాలు కలుషితమై సమీపంలోని పంట పొలాలు నాశనమవుతున్నాయి. ఈ వ్యర్థ జలాల నుంచి వెలువడే దుర్వాసన వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. దీనిపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రొయ్యల పరిశ్రమ యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



ధర్మవరం అగ్రహారంలో ఉన్న రొయ్యల పరిశ్రమ యాజమాన్యం స్థానిక ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకుంటాం. పరిశ్రమలో వ్యర్థ జలాలను రీసైక్లింగ్ పద్ధతిలో శుద్ధి చేసి బయటకు విడిచిపెట్టాలి. అలా కాకుండా వ్యర్థ జలాలను నేరుగా బయటకు విడిచి పెట్టకూడదు. ఆ పరిశ్రమ వద్దకు వెళ్లి పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

- జి.సత్యనారాయణ, ఈవోపీఆర్డీ, ఎస్.రాయవరం మండలం

పోలీస్ శాఖకు స్టాపర్ బోర్డులు అందజేత

అనకాపల్లి రూరల్, జూన్ 24 : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు రామ్‌కో సిమెంట్ లిమిటెడ్ కంపెనీ స్టాపర్ బోర్డులను అందజేసినట్టు ఎస్పీ కేవీ మురళీకృష్ణ సోమవారం తెలిపారు. కశింకోట మండలం ఏఎస్‌పేటలో ఉన్న సదరు కంపెనీ సీఎస్ఆర్ నిధుల్లో భాగంగా వీటిని సమకూర్చినట్టు చెప్పారు. రోడ్డు ప్రమాదాలు తరుచూ సంభవించే (బ్లాక్ స్పాట్) వద్ద వీటిని ఏర్పాటు చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. అలాగే ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కూడా ఇవి ఉపయోగపడతాయన్నారు.

చోడవరం
నియోజకవర్గం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

బ్రాహ్మణ సంక్షేమంపై చిత్తశుద్ధితో కూటమి ప్రభుత్వం

- ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, జూన్ 24: బ్రాహ్మణ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన రాజును పట్టణంలోని గణేష్ గాయత్రీ బ్రాహ్మణ సంఘం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వారికి ప్రత్యేక పథకాలు అమలు చేసిన విషయాన్ని వివరించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం బ్రాహ్మణులకు ఇతోధికంగా సేవలందించడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నదన్నారు. నియోజకవర్గంలో బ్రాహ్మణులందరికీ తాను అండగా ఉంటానని, ఎవరికి ఏ సమస్య వచ్చినా తనను నేరుగా సంప్రదించవచ్చని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం సేవా ట్రస్టు అధ్యక్షుడు కందర్ప కృష్ణమూర్తి, పెద్దలు కందర్ప రామేశం, పుట్రేవు శ్యాంప్రసాద్, వింజమూరి శంకర్, కొమ్మనమంచి మూర్తి. ఉపాధ్యాయులు శ్రీనివాస్, కందర్ప సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మరుపాక మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రావికమతం, జూన్ 24: మండలంలోని మరుపాక ఏపీ మోడల్ స్కూల్‌లో ఏడు నుంచి తొమ్మిదో తరగతి వరకూ మిగులు సీట్లు భర్తీ చేయడానికి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ కె.సత్య సునీల్ ఓ ప్రకటనలో కోరారు. వివిధ కారణాలతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పూర్తిగా వెళ్లిపోయారని తెలిపారు. ఈ సీట్లు భర్తీ చేయడానికి శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏడు నుంచి తొమ్మిదో తరగతిలో చేరేందుకు ఆసక్తి గల విద్యార్థులు పాఠశాల పనిచేసే వేళ్లలో దరఖస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. వారికి ఈ నెల 29న ప్రవేశ పరీక్ష నిర్వహించి, అర్హత సాధించినవారికి సీట్లు కేటాయిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు

పాము కాటుతో మహిళ అస్వస్థత

రావికమతం, జూన్ 24: ఇంటి వెనుక పరిశుభ్రం చేస్తున్న ఓ మహిళను పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆమెను హుటాహుటిన విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని పిల్లవానిపాలెం గ్రామానికి చెందిన అయితిరెడ్డి దేవుడమ్మ (60) సోమవారం ఉదయం తన ఇంటి వెనుక భాగంలో పాచి ఊడ్చుతుండగా ఆ తొక్కులో దాగి ఉన్న పాము కాలుపై కాటు వేసింది. దీంతో ఆమె కేకలు వేస్తూ సొమ్మసిల్లి పడిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే రావికమతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్చారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలిచారు. అక్కడ వైద్యం అందించినా పరిస్థితి మెరుగుపడకపోవడంతో వైద్యుల సూచన మేరకు సోమవారం రాత్రి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

నీట్‌లో అక్రమాలపై సీపీఎం ఆందోళన



ప్రధాన రహదారిలో ఆందోళనకు దిగిన నాయకులు, కార్యకర్తలు

చోడవరం, జూన్ 24: వైద్య విద్యార్థుల ప్రవేశ పరీక్ష నీట్‌లో అక్రమాలు చోటు చేసుకున్నందున తక్షణమే పరీక్ష రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సెంటర్ వద్ద సీపీఎం నాయకులు సోమవారం ఆందోళనకు దిగారు. వైద్య విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేసే విధంగా లోపభూయిష్టంగా పరీక్షలు నిర్వహించిన తీరుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలకు దేశవ్యాప్తంగా 25 లక్షల మంది విద్యార్థులు ఎన్నో రోజులు నిద్రాహారాలు మాని కష్టపడితే, పరీక్షలను లీకులమయంగా మార్చి విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం ఆడుకుందని విమర్శించారు. గతంలో మాదిరిగా మెడికల్ ఎంట్రన్స్ పరీక్షలు ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం నిర్వహించుకునేలా లేకుండా చేసి కేంద్ర ప్రభుత్వం ఈ ప్రవేశ పరీక్షను అక్రమాలకు నిలయంగా మార్చి విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేస్తున్నదని ధ్వజమెత్తారు. వైద్య ప్రవేశ పరీక్షను తిరిగి రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోనే ఉంచాలని, నీట్ పరీక్షల్లో వైఫల్యానికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నీట్‌ను రద్దు చేయాలని స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆందోళన చేసి, కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు జి.కోటేశ్వరరావు, ఎం.అప్పలరాజు, వీవీ శ్రీనివాసరావు, ఆర్.శంకరరావు, గూనూరు వరలక్ష్మి, ఎస్.వీ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.


చినపాచిల నల్లప్ప చెరువులో పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్, నాయకులు

ఎట్టకేలకు చినపాచిలలో ఉపాధి పనులు

రావికమతం, జూన్ 24: మండలంలోని చినపాచిల గ్రామంలో గత ఏడాదిగా నిలిచిపోయిన ఉపాధి హామీ పథకం పనులను ఎట్టకేలకు సర్పంచ్ కోమటి రామలక్ష్మి చొరవతో సోమవారం ప్రారంభించారు. గ్రామంలో 1100 కుటుంబాల వారు ఈ పథకం పనుల్లో పాల్గొనేవారు. అయితే సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు టీడీపీకి చెందిన వారుకావడంతో వైసీపీ పాలకుల అండతో గ్రామ స్థాయి నాయకులు ఇక్కడ వీఆర్‌పీ కోరుకొండ ప్రసాద్‌పై అభియోగం మోపి వీఆర్పీ విధుల నుంచి తాత్కాలికంగా తొలగించడంతో పాటు సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులతో పాటు వీఆర్పీ టీడీపీని వీడి వైసీపీలోకి రావాలని ఒత్తిడి చేసినట్టు సర్పంచ్ చెప్పారు. అయినప్పటికీ తప్పు చేయని తాను టీడీపీని వీడనని వీఆర్పీ ప్రసాద్ స్పష్టం చేశారు. దీంతో గ్రామంలో ఉన్నతాధికారులు విచారణ నిర్వహించగా వీఆర్పీ ఏ అవకతవకలకు పాల్పడలేనట్టు తేలింది. కోర్టు నుంచి కూడా కోరుకొండ ప్రసాద్‌నే కొనసాగించాలని ఉత్తర్వులు వచ్చినా అధికార పార్టీ పాలకులు అమలు చేయలేదు. వీఆర్‌పీ లేకపోయినా పక్క గ్రామ వీఆర్‌తో కూలీలకు పనులు కల్పించాల్సిన ఉపాధి అధికారులు, ఏడాదిగా గ్రామంలో ఉపాధి పనులే కల్పించలేదు. కూటమి అధికారంలోకి రావడంతో గ్రామ సర్పంచ్ కోమటి రామలక్ష్మి, శంకరావు చొరవతో ఈ సమస్యను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు దృష్టికి తీసుకెళ్లడంతో ఉన్నతాధికారులతో మాట్లాడి చినపాచిల వీఆర్పీ ప్రసాద్‌నే కొనసాగించి ఆదేశించారు. ఈ మేరకు సోమవారం నల్లప్ప చెరువులో పూడికతీత పనులను ప్రారంభించగా, 500 మంది ఉపాధి కూలీలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ముచ్చకర్ల గంగాభవానీ, విశాఖ డైరీ పాల ఉత్పత్తిదారుల అధ్యక్షుడు ఆదాడ రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలి

చీడికాడ, జూన్ 24: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సోమవారం మధ్యాహ్నం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ముగిసేవరకూ గ్రామాల్లో కార్యదర్శులు, వైద్య సిబ్బంది తిరిగి అవసరమైతే ఇంటింటికీ వెళ్లి చెత్తచెదారం లేకుండా చూడాలని సూచించారు. అలాగే మురికిగుంటలు, నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. వాటర్ ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. వ్యాధులు సోకితే అప్రమత్తంగా ఉండి వైద్యాధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ అల్లు సూర్యనారాయణ, వైద్యాధికారులు డా.తరణి, శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్, మండల పరిషత్ ఏవో కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మంచాల మోడల్ స్కూల్ హాస్టల్ ప్రారంభం

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్


హాస్టల్‌లో భోజనాలు చేస్తున్న విద్యార్థినులు

చీడికాడ, జూన్ 24: మండలంలో మంచాల మోడల్ స్కూల్ హాస్టల్‌ను సోమవారం ప్రిన్సిపాల్ చెరకాపు వెంకటలక్ష్మి ప్రారంభించారు. 'హాస్టల్ తెరవక విద్యార్థినుల వెతలు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 23వ వార్త ప్రచురణ కావడంతో పాఠశాల ప్రిన్సిపాల్ స్పందించారు. ఈ మేరకు సోమవారం హాస్టల్ ప్రారంభించారు. అనంతరూం పాఠశాల రికార్డు అసిస్టెంట్ ఉమ మాట్లాడుతూ, గతంలో హాస్టల్‌లో ఉన్న 50 మంది విద్యార్థులు వెంటనే జాయిన్ కావాలని కోరగా, సోమవారం 15 మంది వరకు హాస్టల్‌కు వచ్చారన్నారు. అలాగే తొమ్మిదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం వారిని హాస్టల్‌లో చేర్చుకునేందుకు అర్హులైన వారికి సదుపాయం కల్పిస్తామని ఆమె తెలిపారు.

ఎం.కోడూరులో వరి విత్తనాల పంపిణీ


రైతులకు విత్తనాలు అందిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్, జూన్ 24: మండలంలోని ఎం.కోడూరు రైతు భరోసా కేంద్రం వద్ద సోమవారం వరి విత్తనాలు పంపిణీ చేశారు. సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు రైతులకు రాయితీపై వరి విత్తనాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రమణ బాబు, నాయకులు అప్పాన భాస్కరరావు, గెంజి రాజేశ్, ఆర్బీకే సిబ్బంది, పాల్గొన్నారు.

అర్లలో వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో రోగులకు సేవలు అందిస్తున్న వైద్యులు

రోలుగుంట, జూన్ 24: అర్ల గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 'అర్లలో జ్వరాలు విజృంభన' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. ఈ మేరకు సోమవారం ఇంటింటా బృందాలు తిరిగి రోగుల వివరాలు నమోదు చేసుకుని రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని డిప్యూటీ డీఅండ్‌హెచ్‌వో వీరజ్యోతి, జిల్లా మలేరియా నివారణ అధికారి కె.వరహాలుదొర పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో జ్వర బాధితులందరికీ పరీక్షలు నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరాజు ఆధ్వర్యంలో క్లోరినేషన్ చేయించారు. శిబిరంలో ఈవోపీఆర్డీ నూకరాజు, వైద్యాధికారి శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది హరిబాబు, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

మాడుగుల
నియోజకవర్గం

పైనాపిల్ ధరలు తగ్గుముఖం

రూ.10 నుంచి రూ.18 వరకు విక్రయాలు

మాడుగుల, జూన్ 24: పాడేరు ఏజెన్సీలోని పలు గిరిజన ప్రాంతాల్లో రైతులు పండించిన పైనాపిల్ ధరలు తగ్గుముఖం పట్టాయి. సలుగు, పులుసుమామిడి, కక్కి, వంట్లమామిడి, కందులపాలెం, ఈదులపాలెం, దేవాపురం, చింతగరువు ప్రాంతాల నుంచి విక్రయించేందుకు ఇక్కడ జరిగిన సోమవారం వారపు సంతకు తీసుకు వచ్చారు. పైనాపిల్‌ను నెత్తి బరువు, కావిళ్లతో పాటు వాహనాలపై తీసుకొనివచ్చి విక్రయించారు. తొలిదశలో ఒక్కో పండు 20 రూపాయల వరకు అమ్ముడైన అనంతరం చిన్నసైజు రూ.10 నుంచి రూ.18 వరకు విక్రయించారు. గత రెండు, మూడు వారాలు ఒక్కో పైనాపిల్ రూ.25పైగా అమ్మకం జరగగా, గతవారం సైజును బట్టి రూ.18 నుంచి రూ.25 వరకు అమ్ముడయ్యాయి. ఈ వారం ధర గత వారంతో పోల్చితే తగ్గుముఖం పట్టింది. దీంతో రైతులు నిరాశ చెందారు.

గురుకులంలో మిగులు సీట్లకు పరీక్ష

దేవరాపల్లి, జూన్ 24: మండలంలోని తెనుగుపూడి గురుకులంలో (బాలురు) మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 28న రాత పరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సిహెచ్.రవీంద్రనాథ్ తెలిపారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 28వ తేదీన ఉదయం 10 నుంచి 12 వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఉదయం 9 గంటలకే హాజరుకావాలన్నారు. ఆధార్ కార్డు జెరాక్సు, పెన్ తీసుకురావాలన్నారు.

నేడు పరదేశమ్మ ఒడ్డు పండగ



దేవరాపల్లి, జూన్ 24: మండలం లోని రైవాడ శివారు శంబువాని పాలెంలో గ్రామ దేవత పరదేశమ్మ ఒడ్డు పండగ మంగళవారం నిర్వహించనున్నట్టు గ్రామస్థులు తెలిపారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేస్తామని, భక్తులు మొక్కులు తీర్చుకుంటారని చెప్పారు.

విధుల్లోకి తీసుకోవాలని వలంటీర్ల వినతి

దేవరాపల్లి, జూన్ 24: విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ నాగయ్యపేట వంటీర్లు సోమవారం ఎంపీడీవోకు వినతి పత్రం అందించారు. కొవిడ్ లాంటి క్లిష్ట పరిస్థితుల్లో రూ.5 వేల గౌరవ వేతనానికి పనిచేసిన తమను, ఎన్నికల ముందు వైసీపీ నాయకులు బలవంతంగా రాజీనామా చేయించారని వాపోయారు. విధుల్లోకి తీసుకుని ఆదుకోవాలని ఎంపీడీవో సుబ్బలక్ష్మిని కోరారు. ఈ కార్యక్రమంలో వలంటీర్ల సంఘ సభ్యులు వాకాడ సతీష్, జి.అమ్మన్న, కుమారి, స్వాతి, దేవి, తదితరులు ఉన్నారు.

రైతులకు పట్టాలు ఇవ్వాలి

కె.కోటపాడు, జూన్ 24: మండలంలోని చౌడువాడలో మూడు తరాలుగా ఇనామ్ భూములు సాగు చేస్తున్న 66 మంది రైతులకు పట్టాలు ఇవ్వాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రైతులు తమ ఆవేదన వెలిబుచ్చారు. వందేళ్లుగా తమ తాత కాలం నుంచి సాగు చేసుకుంటూ వస్తున్న భూములకు హక్కులు కల్పించకపోవడం శోచనీయమని వాపోయారు. సుమారు 250 ఎకరాలకు పైగా ఇనాం భూములను మూడు తరాలకుపైగా సాగు చేస్తున్నా హక్కులు కల్పించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా పట్టాలు ఇవ్వాలని విన్నవించారు.